

చీనీ టన్ను రూ.16,500
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16,500 పలికాయి.



టమాట కిలో రూ.17
అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/21.6°


జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జేసీ స్టిక్కర్ లేని వాహనాలను ధ్వంసం చేయండి
- జేసీ వర్గీయుల ఆడియో వైరల్

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'తాడిపత్రి నియోజకవర్గం నుంచి చంద్రబాబు కార్యక్రమానికి వెళ్లే ఏ వాహనానికైనా జేసీ స్టిక్కర్ ఉండాల్సిందే. అలా లేకుండా వెళ్లే వాహనాలను ధ్వంసం చేసే హక్కు మనకు ఉంది. ప్రతి ఒక్క జేసీ అభిమాని స్టిక్కర్ లేని వాహనాలను గుర్తించిన వెంటనే ధ్వంసం చేయండి' అంటూ బయట కొచ్చిన ఓ ఆడియో తాడిపత్రివాసులను భయాందోళనకు గురి చేసింది. గతనెల 31న వినాయక విగ్రహాల శోభాయాత్రలో టీడీపీ నేతలు జేసీ ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ్ వర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బుధవారం జిల్లా కేంద్రంలో కూటమి నాయకులు ఏర్పాటు చేసిన సభకు జేసీ, కాకర్ల వర్గీయులు పోటాపోటీగా జన సమీకరణ చేపట్టారు. బల నిరూపణకు చంద్రబాబు సభ మంచి వేదిక అవుతుందని భావించిన కాకర్ల దాదాపు 200 వాహనాలను సిద్ధం చేశారు. వాహనాలపై కాకర్ల బ్రదర్స్ స్టిక్కర్లు ఏర్పాటు చేయించి తాడిపత్రిలో ప్రధాన రహదారిపై ర్యాలీగా వెళ్లేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇదే సమయంలో జేసీ వర్గీయుల ఆడియో వైరల్ కావడంతో తాడిపత్రి పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహనాలపై ఎలాంటి స్టిక్కర్‌లు లేకుండా కేవలం టీడీపీ జెండాలతో అదీ తాడిపత్రి పట్టణంలోకి ప్రవేశించకుండా అక్కన్నపల్లి నుంచి ఔటర్ రోడ్డుపై వాహనాలను మళ్లించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీలో చోటు


శివకుమార్ నాయక్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర కమిటీల్లో చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం.శివకుమార్ నాయక్ (కళ్యాణదుర్గం), క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గైగట్ రాము నియమితులయ్యారు.

రాగులపాడు గురుకులం ప్రిన్సిపాల్‌గా రెగ్యులర్ ఉద్యోగి


వేణుగోపాల్‌నాయుడు

సాక్షి ఎఫెక్ట్..

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని రాగులపాడు గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్‌గా రెగ్యులర్ ఉద్యోగి నియమితులయ్యారు. ఇటీవల పాఠశాల ప్రిన్సిపాల్ బాధ్యతలను ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి కట్టబెట్టడంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయం సర్వత్రా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలోనే ఉన్నతాధికారులుస్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. గుత్తి మండలం సేవాఘడ్ గిరిజన గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్ నాయుడును రాగులపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ డీటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమంతో పాటు గురుకులం అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేత జక్కల ఆదిశేషు మృతి



తనకల్లు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, నల్లమాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జక్కల ఆదిశేషు (44) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవలే ఓడీ చెరువులోని తన బావ బొడ్డు నాగరాజుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఉంటూ చికిత్స పొందుతున్నారు. బుధవారం పరిస్థితి విషమించడంతో అక్కడే తుది శ్వాస విడిచారు. జక్కల ఆదిశేషు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి కదిరి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. అడిగిన వారికి లేదనకుండా సాయం చేసే వ్యక్తిగా ఆయనకు ప్రజల్లో మంచి పేరుంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తన సొంత డబ్బుతో బోర్లు వేయించారు. జక్కల ఆదిశేషు 2014–19 మధ్య కాలంలో నల్లమాడ జెడ్పీటీసీగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య జక్కల జ్యోతి తనకల్లు మండల జెడ్పీటీసీగా ఉన్నారు. జక్కల ఆదిశేషు అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామమైన తనకల్లు మండలం బొంతలపల్లిలో నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

వద్దు బాబోయ్!

విసుగెత్తించిన సూపర్ సిక్స్ సభ


సీఎం చంద్రబాబు మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న మహిళలు


బాబు మాట్లాడుతున్న సమయంలో జనం లేక బోసిపోయిన గ్యాలరీలు

- చంద్రబాబు ప్రసంగం ప్రారంభించిన కొద్దిసేపటికే జనం తిరుగుముఖం
- టీడీపీ కేడర్, పోలీసులు ఎంత ఆపినా ఆగని వైనం
- ప్రసంగం సగం కూడా పూర్తి కాకనే గ్యాలరీలు ఖాళీ
- సభా ప్రాంగణం వద్ద తగిన ఏర్పాట్లు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు
- మండుటెండలో ఉక్కపోతతో అల్లాడిపోయిన మహిళలు


అభివాదం చేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం

అనంతపురం: 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' పేరుతో బుధవారం అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగం ప్రారంభించిన కొద్దిసేపటికే జనం ఇళ్ల బాట పట్టారు. ముఖ్యమంత్రి ప్రసంగం సగం కూడా పూర్తి కాకనే గ్యాలరీలన్నీ ఖాళీ అయ్యాయి. జనాన్ని ఆపేందుకు టీడీపీ కేడర్, పోలీసులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

అడిగి మరీ చప్పట్లు !

సీఎం చంద్రబాబు ప్రసంగం కూడా ఆద్యంతం 'ఆత్మస్తుతి–పరనింద' చందాన సాగింది. తాము చేసిన కార్యక్రమాల గురించి గొప్పలు చెబుతూనే చప్పట్లు కొట్టాలని సీఎం పదేపదే జనాన్ని కోరడంతో వచ్చిన వారు విసుగెత్తిపోయారు. సీఎం కోరినా చప్పట్లు కొట్టడానికి ఆసక్తి చూపించకపోవడంతో 'ఏమయ్యా నేను ఉచితంగా గ్యాస్ ఇచ్చాను. అది వినియోగిస్తున్నారు కదా కనీసం చప్పట్లు అయినా కొట్టండి' అంటూ బతిమాలుకోవడం గమనార్హం. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో జనసేన నాయకులు జెండాలను ఎగురవేయడంతో వాటిని కిందికి దించాలని సీఎం పదేపదే కోరారు. అయినా జనసేన కార్యకర్తలు పోటాపోటీగా జెండాలను ప్రదర్శించడం కనిపించింది. దీనిపై టీడీపీ శ్రేణుల నుంచి అసంతృప్తి వ్యక్తమైంది. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన ప్రసంగాన్ని ఐదు నిమిషాల్లోపే ముగించడంపై పలువురు చలోక్తులు విసిరారు. 'సూపర్ సిక్స్' పూర్తి స్థాయిలో అమలు చేయకనే సూపర్ హిట్ కార్యక్రమం ఏర్పాటు చేయడంపై ఆయనకు ఇష్టం లేదేమో! అంటూ పలువురు చర్చించుకున్నారు.

నానా అవస్థలు..

సభా ప్రాంగణం వద్ద జనం నానా అవస్థలు పడ్డారు. మండుటెండలో ఉక్కపోతతో అల్లాడిపోయారు. పలువురు వేడి తట్టుకోలేక వాంతులు చేసుకున్నారు. కేవలం కొన్ని గ్యాలరీల్లోనే కుర్చీలు వేసి, చాలా చోట్ల వేయకపోవడంతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిల్చోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఎందుకు ఇక్కడికి వచ్చాం దేవుడా అంటూ నిట్టూర్చారు.

పోలీసు ఆంక్షలతో కష్టాలు ..

సూపర్ సిక్స్ సభ సందర్భంగా జిల్లాలో పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రయాణికులకు చుక్కలు కనిపించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించడం గమనార్హం. ఏకంగా అనంతపురం నగరానికి 5 కిలోమీటర్ల దూరం నుంచే బస్సులను, వాహనాలను దారి మళ్లించడంతో ప్రయాణికులకు దిక్కుతోచని స్థితి నెలకొంది. అనంతపురం నుంచి బెంగళూరుకు వెళ్లాల్సిన రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. హైదరాబాద్–బెంగళూరు మార్గంలో వాహనాలను వడియంపేట– బుక్కరాయసముద్రం–నాయనపల్లి క్రాస్– నార్పల– ధర్మవరం–ఎస్ఎస్ గేట్ మీదుగా మళ్లించడంతో తీవ్ర ఇక్కట్లు పడాల్సి వచ్చింది. మధ్యలో నార్పల–బత్తలపల్లి మార్గం సరిగా లేకపోవడంతో ప్రయాణంలో నరకం కనిపించింది. సాధారణంగా అనంతపురం నుంచి పెనుకొండ వద్ద ఉన్న కియా కంపెనీకి ఉద్యోగులు 50 కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిపోయేది. కానీ బుధవారం అదనంగా మరో 40 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చింది.

యంత్రాంగానికీ ఇక్కట్లు..

సభ పూర్తిగా పార్టీ కార్యక్రమమే అయినా అధికార యంత్రాంగాన్ని భాగస్వాములను చేశారు. దాదాపు 10 జిల్లాల నుంచి పోలీసులను కేటాయించారు. ఈ క్రమంలో ఖాకీలు కూడా ఇబ్బందులు పడ్డారు. బందోబస్తు చర్యలను పర్యవేక్షించాల్సింది పోయి జనం సభ నుంచి వెళ్లిపోకుండా కాపలా కాయాల్సి వచ్చింది.

సచివాలయాల మూత


అనంతపురంలో 31వ వార్డు సచివాలయానికి తాళం వేసిన దృశ్యం


బస్సులో మహిళా సంఘాల సభ్యులను తరలిస్తున్న సచివాలయ సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: కూటమి పార్టీల కార్యక్రమం నేపథ్యంలో సచివాలయాలు మూతపడ్డాయి. పైగా ఈ కార్యక్రమానికి తరలించేందుకు సచివాలయ సిబ్బందితోనే జన సమీకరణ చేయించడం గమనార్హం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఆర్టీసీ, ప్రైవేట్, స్కూల్ బస్సుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లారు. మహిళా సంఘాల సభ్యులు వచ్చారో లేదో నమోదు చేసుకున్నారు. సమావేశానికి రాని వారికి ఫోన్లు చేసి పిలిపించారు. అనంతరం తమ పరిధిలో ఎంత మందిని బస్సుల్లో ఎక్కించారో ఆ వివరాలను ఆయా గ్రూపుల్లో నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. అనంతపురంలో అయితే ఎంత మంది బస్సుల్లో ఉన్నారు.. పూర్తి స్థాయిలో వచ్చారా.. తదితర వివరాలు ఆరా తీసేందుకు అధికారులు సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. ఉద్యోగులను పార్టీల కార్యక్రమాలకు వాడుకోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

బెదిరింపులు.. ప్రలోభాలు

సభకు జనాన్ని తరలించాలని 10 రోజుల క్రితమే 'పచ్చ' పార్టీ నేతలు నిర్దేశించారు. ఈ క్రమంలో జనాన్ని తెచ్చేందుకు ఉద్యోగులు బెదిరింపులకు దిగారు. సభకు రాకుంటే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామంటూ డ్వాక్రా మహిళలకు యానిమేటర్లు హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో అనంతపురం రూరల్‌లో ఓ యానిమేటర్ డ్వాక్రా సంఘం లీడర్‌కు చేసిన బెదిరింపుల ఆడియో, కంబదూరు మండలం అచ్చంపల్లిలో టీడీపీ నేతలు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ చాటింపు చేసిన ఘటనలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బలవంతపు తరలింపుపై అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో డ్వాక్రా సంఘాల లీడర్లు తిరగబడడం చర్చనీయాంశమైంది. తాము వచ్చేది లేదని, కావాలంటే తమ సంఘాల్ని గ్రామ సంఘం నుంచి తీసేసుకోండి అని తెగేసి చెప్పడం గమనార్హం.

మద్యం మత్తులో జోగిన తమ్ముళ్లు..


రాప్తాడులో వైన్ షాపు దగ్గర మద్యం కొనుగోలు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

సూపర్ సిక్స్ సభ సందర్భంగా 'తమ్ముళ్లు' మద్యం మత్తులో మునిగితేలారు. పల్లెల నుంచి అనంతపురం నగరానికి వచ్చే మార్గాల్లోని ధాబాల వద్ద బస్సులను ఆపి మద్యం సేవించే ఏర్పాట్లు చేశారు. దీంతో తమ్ముళ్లు 'పండుగ' చేసుకున్నారు. మద్యం తాగి చిందేశారు. మద్యం మత్తులో పలువురు సీఎం సభకు రాకుండా బస్సుల్లోనే సేదతీరారు.


పోలీసులను ఐషర్ వాహనంలో కుక్కి తరలిస్తున్న దృశ్యం


నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి పోలీసు ఆంక్షల కారణంగా బోసిపోయిందిలా..


అనంతపురం నగరంలో పోలీసు ఆంక్షలతో వాహనదారుల ఇక్కట్లు


సభలో ఎండవేడిమికి ఇబ్బందులు పడుతున్న మహిళలు


సూపర్ సిక్స్ సభ నేపథ్యంలో మూతపడిన అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల కళాశాల

వెంటాడుతున్న యూరియా కష్టాలు

- అనంతపురంలో ఎక్కడా ఒక్క బస్తా కూడా దొరకని వైనం
- ఉచిత సలహాలు ఇస్తుండటంపై అన్నదాతల మండిపాటు



అనంతపురం అగ్రికల్చర్: అన్నదాతను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. బస్తా, రెండు బస్తాల యూరియా కోసం బారులు తీరుతున్నారు. ఉదయం ఏడింటికే ఆర్ఎస్‌కేలు, సొసైటీలు, ప్రైవేట్ దుకాణాల వద్దకు చేరుకుంటున్నారు. మండుటెండలో నిలబడ లేక వరుసల్లో చెప్పులు, బ్యాగులు, టవాళ్లు పెట్టి గంటల కొద్దీ వేచి చూస్తున్న దుస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి యంత్రాంగం మొత్తం జిల్లాకు చేరుకున్న బుధవారం కూడా చాలా ప్రాంతాల్లో యూరియా కోసం రైతులు తిప్పలు పడటం కనిపించింది.

ఒక్క బస్తా కూడా లేదు..

వారం రోజులుగా మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు సూపర్ హిట్ సభ కోసం జిల్లా కేంద్రంలో మకాం వేసినా రైతులు పడుతున్న కష్టాలపై ఒక్కరు కూడా స్పందించలేదు. వైఎస్సార్‌సీపీ పోరాటం ఫలితంగా అంతో ఇంతో యూరియా సరఫరా అవుతోంది. అది కూడా కంటి తుడుపుగా సరఫరా చేస్తూ రైతులందరికీ యూరియా దక్కకుండా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 436 ఆర్ఎస్‌కేలు, మూడు డీసీఎంఎస్‌లు, 13 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), రెండు ఎఫ్‌పీఓలు, మూడు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లు, 460 రీటైల్ దుకాణాల్లో యూరియా నిల్వలు దాదాపు అడుగంటిపోయాయి. అధికార పార్టీ నేతల కోసం బఫర్‌స్టాక్ కింద మాత్రం 500 మెట్రిక్ టన్నులు పెట్టుకున్నారు. ఇటీవల మూడు కంపెనీల నుంచి వచ్చిన అరకొర యూరియా వచ్చింది వచ్చినట్లే ఖాళీ అవుతుండటంతో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ సీజన్‌లో 30 వేల మెట్రిక్ టన్నులకు పైగా పంపిణీ చేశామని చెబుతున్నా కచ్చితమైన లెక్కలు మాత్రం చూపడం లేదు. ఈ క్రమంలోనే యూరియా ఎక్కువగా వాడొద్దంటూ ఉచిత సలహాలిస్తుండటంపై రైతులు మండిపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనిది యూరియా వాడకంపై నేడు కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. అనంతపురం నగరంలో వందలాది దుకాణాలు ఉన్నా ఎక్కడా ఒక బస్తా యూరియా లభించే పరిస్థితి లేదు.

బ్లాక్‌మార్కెట్‌కు తరలించడంతోనే..

ఆగస్టులో వర్షాలు పడడంతో వరి నాట్లు పెరిగాయి. ఇప్పటికే 20 వేల హెక్టార్లలో వరి సాగులో ఉంది. ప్రస్తుతం నాట్లు కుదురుకోవాలంటే తప్పనిసరిగా యూరియా అవసరం ఉండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. అలాగే మొక్కజొన్న 22 వేల హెక్టార్లు, అరటి 10 వేల హెక్టార్లు, వేరుశనగ 79 వేల హెక్టార్లు, కంది 94 వేల హెక్టార్లు, ఆముదం 15 వేల హెక్టార్లలో సాగు చేసిన అన్ని పంటలకు అంతో ఇంతో యూరియా వేసుకోవాల్సిన పరిస్థితి ఉన్నందున రైతుకు ఇబ్బందిగా మారింది. జిల్లాకు చేరిన యూరియాను చాలా వరకు బ్లాక్‌మార్కెట్‌కు తరలించడంతోనే దుస్థితి తలెత్తిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 2019–2024 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున పంటలు సాగులోకి వచ్చినా ఎన్నడూ ఎక్కడా యూరియా సమస్య ఎదురుకాలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

పేదల వైద్యం.. ప్రైవేటు పరం

- పెనుకొండ మెడికల్ కళాశాలపై కాల 'కూటమి' విషం
- పీపీపీ పేరుతో ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం
- కరువు ప్రజలకు కార్పొరేట్ ఉచిత వైద్యం ఇక కలే
- ఎకరా రూ.2 కోట్ల విలువైన భూమిని ఏడాదికి రూ.100తో లీజు


జగన్ హయాంలో జరిగిన ఆస్పత్రి భవన నిర్మాణ పనులు

పెనుకొండ: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడం..వైద్య విద్యనభ్యసించే విద్యార్థులకు మరిన్ని మెడికల్ సీట్లు అందుబాటులోకి తెచ్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున నూతన మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే 2021 అక్టోబర్ 31న అప్పటి సీఎం వైఎస్ జగన్ వర్చువల్ పద్ధతిలో పెనుకొండ మెడికల్ కళాశాలకు కూడా శంకుస్థాపన చేశారు. దీంతో ఈ ప్రాంత వాసులంతా ఎంతో సంతోషించారు. మెడికల్ కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు కావడంపై హర్షించారు. పెనుకొండకు ప్రత్యేక గుర్తింపుతో పాటు పేదలకు మేలు జరుగుతుందని సంబరపడ్డారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రైవేటు పరం చేస్తుండడంపై ఆవేదనకు గురవుతున్నారు.

వడివడిగా పనులు..

పెనుకొండ మెడికల్ కళాశాలకు వైఎస్సార్ సీపీ హయాంలో రూ. 475 కోట్లు మంజూరయ్యాయి. మెడికల్ కళాశాలతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నర్సింగ్ ఆస్పత్రి నిర్మాణానికి గత ప్రభుత్వమే శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అప్పటి ఎమ్మెల్యే శంకరనారాయణ అధికారులను పరుగులు పెట్టించి పనులు వేగవంతం చేశారు. కానీ కళాశాల ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో బండరాళ్లు ఉండటంతో వాటిని బ్లాస్టింగ్ చేస్తూ పనులు చేపట్టారు. ఈ క్రమంలో పనులు కాస్త ఆలస్యమయ్యాయి. అయినప్పటికీ అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని భవనాలకు పిల్లర్లను నిర్మించడమే కాక కొన్ని భవనాలకు పైకప్పు పనులు సైతం పూర్తి చేశారు. అప్పటి ఎమ్మెల్యే శంకరనారాయణ, ఉమ్మడి జిల్లా మంత్రిగా ఉన్న ఉషశ్రీచరణ్, కలెక్టర్, ఇతర అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి పనులు ముందుకు సాగేలా చూశారు.

కూటమి రాకతో ఆశలు ఆవిరి..

కూటమి ప్రభుత్వం వచ్చాక పెనుకొండ మెడికల్ కళాశాల పనులు నిలిచిపోయాయి. పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థను ఇక్కడి నుంచి పాలకులు సాగనంపారు. ఇక కొత్త కాంట్రాక్ట్ సంస్థకు ఇస్తారని ప్రజలు భావించినా... అందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు అప్పగిస్తూ కేబినెట్‌లో తీర్మానించడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఉచిత వైద్యం అందుతుందనుకుంటే ముక్కు పిండి వసూలు చేసే ప్రైవేటు విధానం అమల్లోకి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా రూ.వందల కోట్ల విలువైన వైద్య కళాశాల భూమిని ఎకరా ఏడాదికి కేవలం రూ.100తో లీజుకు ఇవ్వడంపై మండిపడుతున్నారు. కూటమి సర్కార్ చర్యల వల్ల ఈప్రాంత ప్రజలకు ఉచిత వైద్యం అందకపోగా, ఈ ప్రాంత యువత వైద్యవిద్యకూ అడ్డంకులు ఎదురవుతాయంటున్నారు. ఇప్పటికైనా కూటమి సర్కార్ తన నిర్ణయాన్ని విరమించుకుని పెనుకొండ కళాశాలను పూర్తి చేసి ఈప్రాంత పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందేలా చూడాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మాయ చేయడం బాబుకు కొత్తేమీ కాదు

- మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య



కళ్యాణదుర్గం: జనాలను మాయ చేయడం సీఎం చంద్రబాబుకు కొత్తేమీ కాదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అంటూ సూపర్ మోసం సభను నిర్వహించారంటూ వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య విమర్శించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన తర్వాత ఏడాది పాటు పథకాలు ఎగ్గొట్టి అన్ని పథకాలు ఇచ్చామంటూ మోస చేశారన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో మొదటి పథకమైన 'ఆడబిడ్డ నిధి' కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ హామీ ఇప్పటి వరకూ నెరవేర్చలేదన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న తన సొంత నియోజకవర్గం కుప్పానికి నీళ్లు తరలించుకెళ్లడంపై ఉన్న శ్రద్ధ, జీడిపల్లికి కూతవేటు దూరంలో ఉన్న బీటీపీకి నీళ్లిచ్చే విషయంలో ఏమైందని ప్రశ్నించారు. జిల్లా ప్రజలకు కల్పతరువుగా ఉన్న ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ విషయంలో ఎందుకు స్పష్టత ఇవ్వలేకపోయారని నిలదీశారు. ప్రజలను మాయ చేసేందుకే సభల పేరుతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం సిగ్గుచేటన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి

- పెళ్లైన నాలుగు నెలలకే విషాదం



రంజిత్ (ఫైల్)

బొమ్మనహాళ్: పాముకాటుతో ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. బొమ్మనహాళ్ మండలంలోని లింగదహాళ్ గ్రామానికి చెందిన కృష్ణమ్మ, తిప్పేస్వామి దంపతుల కుమారుడు రంజిత్ (22)కు నాలుగు నెలల క్రితం కర్ణాటకలోని కమ్మరచేడు గ్రామానికి చెందిన మహాలక్ష్మితో వివాహమైంది. దానిమ్మ చెట్ల కటింగ్‌తో జీవనం కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం అనంతపురం సమీపంలోని ఓ తోటలో దానిమ్మ చెట్ల కటింగ్ చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. దీంతో అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స అనంతరం స్వగ్రామానికి వచ్చిన తర్వాత నాటు వైద్యం చేయించుకున్నాడు. మంగళవారం పరిస్థితి విషమించడంతో బళ్లారిలోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాలు చాలా ఆలస్యమయ్యాయి. ఆ తర్వాత వర్షాలు ఎక్కువగా కురవడంతో పంటలు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. ఫలితంగా గుంతకల్లు మండలం నక్కనదొడ్డి తండాలో చేతికొచ్చిన పంట తుడిచిపెట్టుకుపోయింది. చాలా మంది రైతులకు పెట్టుబడులు కూడా దక్కలేదు. గ్రామంలో ఉపాధి పనులు కల్పించకపోవడంతో ఏంచేయాలో దిక్కుతోచని రైతులు వలస వెళ్లారు. వృద్ధులను ఇళ్ల వద్ద వదిలి పొట్ట చేతపట్టుకుని పోయారు. జీవనోపాధి కోసం పల్లె తరలిపోవడంతో పిల్లలు లేక పాఠశాల బోసిపోయింది. జనం లేక నిశ్శబ్దంతో వీధులన్నీ వెలవెలబోతున్నాయి.



ఊరు వలసెల్లింది!

- వర్షాభావంతో తగ్గిన వ్యవసాయం
- ఉపాధి హామీ పనుల కల్పనలో వైఫల్యం
- బతుకు తెరువుకు తప్పని వలస బాట






వలసల కారణంగా నక్కనదొడ్డి తండాలో మూత పడిన గృహాలు

గుంతకల్లు రూరల్: వ్యవసాయ పనులు సాకుగా చూపి గత మూడు నెలలుగా నక్కనదొడ్డి తండాలో ఉపాధి హామీ పనులు నిలిపివేశారు. దీనికి తోడు గ్రామంలో వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కుటుంబాలు ఒక్కొక్కటిగా వలస బాట పట్టాయి. ఈ క్రమంలో వలస వెళ్లే వారి సంఖ్య రోజురోజుకూ పెరగడంతో నక్కనదొడ్డి తండాలో ఎటు చూసినా తాళం వేసిన ఇళ్లు, ఆ ఇళ్లను కాచుకుని ఉంటున్న వృద్ధులే కనిపిస్తున్నారు.

వ్యవసాయమే జీవనాధారం

నక్కనదొడ్డి తండాలో దాదాపు 110 కుటుంబాలు, 500కు పైగా జనాభా ఉంది. గ్రామంలో ఎక్కువ శాతం మంది ప్రజలు వ్యవసాయం, ఉపాధి పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయ పనులకు కూలీలు సక్రమంగా రావడం లేదని మూడు నెలల క్రితం ఉపాధి పనులను నిలిపి వేశారు. దీంతో కూలి పనులు తప్ప మరో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం తెలియని తండా వాసులు దిక్కుతోచలేదు. రోజురోజుకూ ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా మారడంతో చివరకు కొందరు మూటముల్లె సర్దుకుని రైల్వే కోడూరు, రాజంపేట, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్లారు. తర్వాతి రోజుల్లోనూ ఇంకొందరు... ఆ తర్వాత మరికొందరు వలస వెళ్లడంతో గ్రామంలో ఎటు చూసినా తాళం వేసిన ఇళ్లు కనిపిస్తున్నాయి. ఆరోగ్య పరిస్థితులు, ఇతర కారణాలతో ఇంటిని వదిలి వెళ్లలేని వారు అరకొర వ్యవసాయ కూలి పనులతో ఓ పూట తింటూ మరో పూట పస్తులుంటూ జీవనం సాగిస్తున్నారు. కనీసం ఉపాధి పనులు కల్పించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని ఇళ్ల వద్ద కాచుకుని ఉంటున్న వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనులు లేవు



వ్యవసాయ సీజన్ అని చెప్పి గ్రామంలో మూడు నెలలుగా ఉపాధి పనులు కల్పించ లేదు. కనీసం వ్యవసాయ కూలి పనులతోనైనా నెట్టుకొద్దామంటే ఆ పనులూ అరకొరగానే ఉన్నాయి. వారంలో రెండు రోజులు పనికి వెళ్తే మిగిలిన ఐదు రోజులూ ఇంటి వద్దనే ఖాళీగా ఉండాల్సి వస్తోంది. దీంతో కుటుంబాలతో కలసి కొడుకులు వలస పోయారు. ఉన్న దాంట్లోనే ఓ పూట తిని, మరో పూట పస్తులుంటున్నాం.

– భీమా నాయక్, నక్కనదొడ్డి తండా

మూడు వారాల కూలి రావాలి



ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి మూడు వారాల కూలి ఇప్పటి వరకూ ఇవ్వలేదు. దీనికి తోడు మూడు నెలలుగా పనులు ఆపేశారు. వర్షాలు లేక వ్యవసాయ పనులూ లేకుండాపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు ఊరి వదిలి వెళ్లకతప్పలేదు.

– సాలమ్మ, నక్కనదొడ్డి తండా

ఇంటికి కాపలాగా ఉన్నా



నా పెద్దకొడుకు, కోడలు, వారి కొడుకు అందరూ రైల్వే కోడూరుకు వలస వెళ్లారు. దీంతో నేను ఇంటికి కాపలాగా ఉంటున్నా. వ్యవసాయ సీజన్ వచ్చిందంటే చాలు ఏటా ఇదే పరిస్థితి. ఇంకొన్ని రోజులు పోతే ఊరు మొత్తం ఖాళీ అవుతుంది.

– బాలమ్మ, నక్కనదొడ్డి తండా

పనులు నిలిపిన మాట వాస్తవం

వ్యవసాయ సీజన్ కారణంగా ఉపాధి పనులు నిలిపిన మాట వాస్తవం. ఉపాధి పనులకు గ్రామస్తులు హాజరయ్యేలా ఉంటే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా డిమాండ్ పెట్టిస్తే వెంటనే పనులు కల్పిస్తాం.

– కృష్ణమూర్తి, ఏపీఓ, డ్వామా

బెల్టు షాప్ సీజ్



సీజ్ చేసిన మద్యం దుకాణం వద్ద ఎక్సైజ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి టౌన్: మండలంలోని గంగాదేవిపల్లి సమీపంలో ఉన్న ఇగుడూరు గంగమ్మ ఆలయం వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన బెల్టు షాపును ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. ఆలయ సమీపంలో షెడ్డు వేసి అక్రమంగా మద్యం విక్రయాలు చేపట్టిన అంశంపై ఈ నెల 10న 'ఆలయ ప్రతిష్ట గంగ పాలు' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనానికి ఎక్సైజ్ సీఐ నాయుడు స్పందించారు. సిబ్బందితో కలసి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బెల్టు షాప్ తెరిచి మద్యం విక్రయిస్తున్నట్లుగా గుర్తించి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. షెడ్డును సీజ్ చేశారు. నిందితుడు సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. అలాగే తాడిపత్రిలోని పాతకోట, వాహిని థియేటర్ సమీపంలో ఉన్న కల్లు దుకాణాల్లో నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దవడుగూరు: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ప్రకాష్ (19) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం పురుగుల మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. కాగా, ప్రకాష్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చాంపియన్ షిప్‌కు అడుగు దూరంలో మధ్యప్రదేశ్




హర్షిత్ దూబే రక్షణ్

అనంతపురం : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్–19 ఇన్విటేషన్ టోర్నీలో చాంపియన్ షిప్ దక్కించుకునేందుకు అడుగు దూరంలో మధ్యప్రదేశ్ జట్టు నిలిచింది. ఆర్డీటీ క్రీడా మైదానంలో బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో మధ్యప్రదేశ్, బరోడా జట్లు విజయం సాధించాయి.

ఆంధ్రా ప్రెసిడెంట్ – మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంపిక చేసుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 282 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. హర్షిత్ దూబే 133 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్సర్లతో 136 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రా ప్రెసిడెంట్ జట్టు 24.3 ఓవర్ల వద్ద 154 పరుగులకే చతికిల పడింది. కోగటం హనీష్ వీరారెడ్డి కేవలం 27 బంతుల్లో 8 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 63 పరుగులు సాధించాడు. ఫలితంగా మధ్యప్రదేశ్ 128 పరుగుల తేడాతో గెలుపొందింది. ఆంధ్రా సెక్రెటరీ, బరోడా జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్రా సెక్రెటరీ జట్టు 49.4 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. బ్యాటర్ రక్షణ్ 123 బంతుల్లో 147 పరుగులు సాధించాడు. తర్వాత బరిలో దిగిన బరోడా జట్టు 47.3 ఓవర్ల వద్ద నాలుగు వికెట్ల నష్టానికి 255 పరుగులు సాధించి గెలుపొందింది. పాయింట్ల పట్టికలో ఆధిక్యంలో ఉన్న జట్టు టోర్నీ చాంపియన్‌గా నిలవనుంది. ఈ లెక్కన ఇప్పటి వరకూ మధ్యప్రదేశ్ జట్టు అగ్రస్థానంలో ఉండడంతో ఈ జట్టు చాంపియన్‌గా నిలవడం దాదాపు ఖరారైంది. గురువారం రెండు మ్యాచ్‌ల అనంతరం చాంపియన్‌ను ప్రకటించనున్నారు.

అలరించిన మన్యం భక్తులు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న పార్వతీపురం మన్యం భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి విచ్చేసిన సత్యసాయి భక్తులు బుధవారం సాయికుల్వంత్ సభామందిరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అంతకు ముందు సామూహిక సత్యసాయి వ్రతాలు, సత్యసాయి అష్టోత్తర నామాలు, సత్యసాయి శతనామావళి జపించారు. సాయంత్రం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.

వ్యక్తి బలవన్మరణం

పరిగి: మండలంలోని శీగిపల్లికి చెందిన రంగనాథ్ (40) ఆత్మహత్య చేసుకున్నాడు. కర్ణాటకలోని మధుగిరి ప్రాంతానికి చెందిన రంగనాథ్‌కు వివాహమైంది. రెండేళ్లుగా భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్న రంగనాథ్.. కొన్ని నెలల క్రితం శీగిపల్లికి చేరుకుని తన పెద్దమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి పక్కింట్లో నిద్రించడానికి వెళ్లిన రంగనాథ్ బుధవారం ఉదయం ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో చుట్టుప్రక్కల వారు తలుపులు బద్దలుగొట్టి లోపలకు వెళ్లి చూశారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రంగనాథ్‌ను గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి నాగరాజప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

• అధినేతతో భేటీ



వైఎస్ జగన్‌తో రమేష్‌గౌడ్



వైఎస్ జగన్‌కు జ్ఞాపికను ఇస్తున్న వైపీ బాబు (చిత్రంలో) ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురంకార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు కలసి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

నేపాల్‌లో చిక్కుకున్న వారి భద్రతకు ప్రత్యేక చర్యలు

ప్రశాంతి నిలయం: నేపాల్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అక్కడ నివసిస్తున్న, పర్యటన నిమిత్తం వెళ్లి చిక్కుకుపోయిన రాష్ట్ర ప్రజల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన వారు ఎవరైనా నేపాల్‌లో చిక్కుకున్నట్లయితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08555289039 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. బాధితుల సమాచారం తెలియజేస్తే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. లేదంటే ఇక్కడికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

పేరుకే 100 .. ఉండేది 50 !

- ఏళ్లుగా సాగుతున్న వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు
- రాయదుర్గం ఏరియా ఆస్పత్రిని వీడని సమస్యలు
- పట్టించుకోని కూటమి సర్కారు



ఆగిన రాయదుర్గం ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణం



ఒక బెడ్డుపై ఇద్దరు ముగ్గురు సర్దుకుంటున్న రోగులు

రాయదుర్గం: స్థానిక ఏరియా ఆస్పత్రిని సమస్యలు నీడలా వెన్నాడుతున్నాయి. వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2021లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. రూ.17 కోట్ల వ్యయంతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. రెండేళ్ల పాటు పనులు చకచక సాగాయి. దాదాపు 85 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కోడ్ అడ్డురావడం... ఆ తర్వాత ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో పనులు పూర్తిగా పడకేశాయి. దీంతో పేరుకే 100 పడకలైనా 50 పడకలతోనే సర్దుకోవాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు.

ఒకే బెడ్డుపై ముగ్గురు

రాయదుర్గం మండల వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభించాయి. ఈ నేపథ్యంలో ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. సాధారణ రోజుల్లో 500 నుంచి 600 నమోదయ్యే ఓపీ.. ప్రస్తుతం800 నుంచి వెయ్యికి పైగా ఉంటోంది. రోగులను అడ్మిట్ చేస్తే ఒకే బెడ్డుపై ఇద్దరు లేదా ముగ్గురిని ఉంచాల్సి వస్తోంది. సౌకర్యాలు లేక రోగుల సహాయకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరుబయట నిద్రిస్తే దోమల ఉధృతి కారణంగా మరుసటి రోజే అస్వస్థతకు గురవ్వాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్యుల్లేక ఇబ్బంది

సరిపడ వైద్యులు, సిబ్బందిలేక అత్యవసర విభాగాలతో పాటు ఓపీ సేవల్లోనూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. 23 మంది వైద్యులు ఉండాల్సిన ఈ ఆస్పత్రిలో కేవలం 10 మందితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో ఓపీ వేళల్లో వైద్యులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. నర్సింగ్, ఇతర విభాగాల్లో 73 మంది ఉండాలి. కేవలం 20 మంది మాత్రమే ఉంటున్నారు. రోజు వెయ్యి మంది రోగులు ఓపీ సేవలను అందుకుంటున్నారు.

ఒక్కో బెడ్డుపై ఇద్దరు



పేరుకే వంద పడకల ఆస్పత్రి. ఇక్కడ ఒక్కో బెడ్డుకు ఇద్దరు, ముగ్గురిని కేటాయించి చికిత్స చేస్తున్నారు. నూతన ఆస్పత్రి భవన నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా 50 పడకలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. సరైన సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

– కొట్రేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, రాయదుర్గం

వైద్యులను నియమించాలి



రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. వెంటనే వైద్యులను నియమించాలి. గత ప్రభుత్వం లో 100 పడకల ఆస్పత్రిగా అప్‌డేట్ చేశారు. రూ.17 కోట్లతో నూతన భవనం నిర్మాణ పనులు చేపట్టారు. 85 శాతం పనులు పూర్తయాయి. మిగిలిన 15 శాతం పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

– గోనబావి ఉబ్బగజాల, కౌన్సిలర్, రాయదుర్గం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. రోగులకు ఇబ్బంది కలగకుండా వైద్యం అందిస్తున్నాం. నూతన ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొస్తాం. కొత్త ఆస్పత్రి ప్రారంభమైతే మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– డాక్టర్ మెర్సీ జ్ఞానసుధ, ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం

క్లుప్తంగా

గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలి



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ భార్గవి

ఆత్మకూరు: గర్భం దాల్చినప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ భార్గవి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలతో పాటు కోడిగుడ్లు, పాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం రక్త, బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి మందులను అందించారు.

చిన్నారికి మంత్రి అభినందన



చిన్నారిని అభినందిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన కేంద్రియ విద్యాలయ 3వ తరగతి విద్యార్థిని నవనిని మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అభినందించారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటేందుకు చొరవ చూపుతున్న చిన్నారిని అభినందించారు.

విజయనగరలో స్థానికులకే సీట్లు కేటాయించాలి



ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనితకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని విజయనగర లా కళాశాలలో 80 శాతం సీట్లు స్థానికులకే కేటాయించాలని ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, బీఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు వినతిపత్రం అందజేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎల్ఎల్‌బీలో సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ యూనివర్సిటీల కన్వీనర్ యనమల ప్రసాద్, నాయకులు విజయ్‌కుమార్, భాను ప్రకాష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు శంకర్, బీఎస్ఎఫ్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ వివాహం



వధూవరులతో దివ్యాంగ సంక్షేమ సంఘం నాయకులు

రాప్తాడురూరల్: మతాంతర వివాహం చేసుకున్న దివ్యాంగులు పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కూడేరు మండలం కొర్రకోడు గ్రామానికి చెందిన అల్లావుద్దీన్, నార్పల మండలం వెంకటాంపల్లికి చెందిన ఈశ్వరమ్మ ఇద్దరూ దివ్యాంగులే. అల్లావుద్దీన్ రెండుకాళ్లు లేకపోయినా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బ్రేకులు కూడా చేతులతో ఆపరేట్ చేసేలా మార్పు చేయించుకున్నాడు. ప్రస్తుతం అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో నివాసం ఉంటున్నాడు. అల్లావుద్దీన్, ఈశ్వరమ్మ ఒకరినొకరు ఇష్టపడడంతో ఇరు కుటుంబాల అంగీకారం మేరకు దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కురుగుంటలో అల్లావుద్దీన్ నివాసం వద్ద వివాహం జరిపించారు. ముస్లిం సంప్రదాయ పద్ధతిలో నిఖా చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షఫీ, మహిళా అధ్యక్షురాలు వడ్డే లక్ష్మీదేవి, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథరెడ్డి, నామాల ఈశ్వర్, నాగభూషణం, సర్ఫున్నీషా, షెక్షావలి, రామాంజనేయులు పాల్గొన్నారు.

బస్సులు లేక అవస్థలు



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సుల్లో అత్యధిక శాతం సీఎం చంద్రబాబు 'సూపర్‌సిక్స్' సభకు జనాన్ని తరలించడానికి వినియోగించారు. దీనివల్ల వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన సామాన్య ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అనంతపురం ఆర్టీసీ బస్టాండులో గంటల కొద్దీ నిరీక్షించినా..తమ ప్రాంతానికి వెళ్లే బస్సులు రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. అడపాదడపా వచ్చిన బస్సుల్లో కిక్కిరిసి వెళ్లారు. సీఎం వచ్చినంత మాత్రాన బస్సులు అందుబాటులో లేకుండా చేయడమేంటని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతూ



ఖాళీ సీట్ల కోసం ఆరాటం




ప్రయాణికులతో కిక్కిరిసిన అనంతపురం ఆర్టీసీ బస్టాండ్

సీఎం సభకు రాకుంటే పథకాలు కట్

- డ్వాక్రా సంఘాల సభ్యులకు యానిమేటర్లు, సీసీల బెదిరింపులు
- అనంతపురం రూరల్‌లో బెదిరింపుల పర్వం
- పాపంపేటలో డ్వాక్రా సంఘాల లీడర్ల తిరుగుబాటు
- పైసా లబ్ధి చేకూర్చకుండా ఏవిధంగా రావాలంటూ ధ్వజం

రాప్తాడురూరల్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డ్వాక్రా సంఘాలకు ఏమాత్రం లబ్ధి చేకూర్చకపోయినా ముఖ్యమంత్రి సమావేశానికి ప్రతి సభ్యురాలు ఖచ్చితంగా రావాల్సిందేనంటూ హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం బుధవారం అనంతపురంలో చేపట్టిన 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' కార్యక్రమానికి డ్వాక్రా సంఘాల సభ్యులను తరలించేందుకు జిల్లాస్థాయి అధికారుల నుంచి గ్రామ స్థాయి యానిమేటర్ల వరకు పడరానిపాట్లు పడ్డారు. మహిళల సమీకరణకు ముందురోజు పలుమార్లు గూగుల్ మీట్లు పెట్టుకుని మరీ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన యానిమేటర్లు సంఘాల లీడర్లకు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగడం గమనార్హం. 'ప్రతి సభ్యురాలు రావాల్సిందే. బస్సుల్లో అటెండెన్స్ ఉంటుంది. ఏ సంఘం నుంచి ఏ ఒక్కరు రాకపోయినా మాకు తెలిసిపోతుంది. వారికి రూ. 200 ఫైన్ వేయాలంటూ సారోళ్లు చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సభ్యురాలూ మీటింగ్‌కు రావాలి. ప్రతి గ్రామానికి బస్సులు ఏర్పాటు చేశారు. ఎవరైనా రాకపోతే లోన్ సమయంలోనూ, పొదుపు సమయంలోనూ చాలా ఇబ్బంది పడతారు. ఇందుకు లీడర్లే బాధ్యత వహించాలి' అంటూ బెదిరించారు. అనంతపురం రూరల్ మండలంలో ఓ గ్రామ లీడరుకు యానిమేటర్ ఫోన్‌లో బెదిరించిన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.



అందరికి నమస్కారం అక్క
రేపు CM గారి మీటింగ్ కి ప్రతి
ఒక్క సంఘం నుండి ప్రతి
సభ్యురాలు మధ్యాహ్నం 12
గంటలకు పాపంపేట మెయిన్
రోడ్డు ZUDIYO దగ్గరకి అందరూ
రావాలి అక్కడి నుండి బస్సు
లో వెళ్తాము కావున అందరూ
సమయానికి వచ్చేటట్లు
చూడండి
12:12 pm
Forwarded

సీఎం మీటింగ్‌కు రావాలంటూ పాపంపేటకు చెందిన ఓ గ్రూపులో వచ్చిన మెసేజ్

పాపంపేటలో తిరగబడ్డ డ్వాక్రా సంఘాల లీడర్లు

అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో కొందరు లీడర్లు యానిమేటర్లపై తిరగబడ్డారు. తాము రామంటే రామని తెగేసి చెప్పారు. యానిమేటర్లు, సీసీలు, చివరకు ఏపీఎం కూడా ఫోన్లు చేసినా వారి నుంచి ఇదే జవాబు రావడంతో ఖంగుతిన్నారు. డ్వాక్రా సంఘాలకు పైసా లబ్ధి చేకూర్చలేదు.. ఏ మొహం పెట్టుకుని తాము రావాలంటూ లీడర్లు నిలదీశారు. ప్రతి సంఘానికి రూ. 10 లక్షల దాకా వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నా ఇప్పటిదాకా కనీసం లక్ష రూపాయలు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి సంఘానికి రూ. 50 వేలు మొదలు రూ. 6 లక్షల దాకా రుణాలు మాఫీ అయ్యాయన్నారు. ఒక్కో సభ్యురాలికి రూ. 50–60 వేలు కూడా మాఫీ చేశారన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో సున్నా వడ్డీ ప్రతి సభ్యురాలూ వేలాది రూపాయలు లబ్ధి పొందారన్నారు. ఒక్కో సంఘానికి రూ. 20 లక్షల దాకా రుణాలు కూడా ఇచ్చారన్నారు. ఈ ప్రభుత్వంలో ఒక పైసా మాఫీ చేయలేదని, సున్నా వడ్డీ అసలే ఇవ్వలేదన్నారు. రుణాలిచ్చినా పీడీఎస్, సర్వీస్ చార్జెస్ పేరుతో కోతలు పెడుతున్నారన్నారు. అలాంటి మీరు ఏవిధంగా తమను మీటింగ్‌కు రావాలని చెబుతున్నారు.. తాము వచ్చేది లేదని ఫైన్ కాకపోతే మా సంఘాల్ని గ్రామ సంఘం నుంచి తీసేసుకోండి అని తెగేసి చెప్పారు. ఏమాత్రం ఉపయోగం లేని సంఘాలు మాకు అవసరం లేదని చెప్పడంతో సంబంధిత అధికారుల నుంచి నోటిమాట రాలేదు.



రాప్తాడు నుంచి సీఎం సభకు అరకొరగా వెళ్తున్న జనం

ఉపాధి పనులు ఆపేస్తాం..

సీఎం సభకు రాకుంటే గ్రామాల్లో ఇక నుంచి ఉపాధి పనులు కల్పించామని ఉపాధి హామీ అధికారులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ ప్రకటించడంతో కూలీలు పనులు ఆపేస్తారేమో అంటూ సభకు తరలివచ్చారు. గ్రామాల్లో ముందు రోజే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్స్ ఉపాధి పనుల దగ్గర టాం.. టాం వేశారు. ఉపాధి పనులు ఆపేస్తే బతకడం కష్టమంటూ కూలీలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. రాప్తాడు నియోజకవర్గంలోని మండలాల నుంచి డ్వామా అధికారులు, వెలుగు అధికారులు మహిళలు, ఉపాధి కూలీలను తరలించారు.

విద్యార్థుల తల్లిదండ్రులూ రావాల్సిందే..

డ్వాక్రా గ్రూపు సభ్యులే కాకుండా జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో సైతం జన సమీకరణ చేపట్టారు. సీఎం ప్రోగ్రామ్‌లకు స్కూల్ బస్సులు పంపుతున్నాం...విద్యార్థుల తల్లిదండ్రులందరూ రావాల్సిందే అంటూ సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు పంపినట్లు సమాచారం.

నిబంధనలకు తూట్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభను విజయవంతం చేసేందుకు ఒక పక్క అధికారులు, మరో పక్క ప్రజా ప్రతినిధులు నిబంధనలకు తూట్లు పొడిచారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సూపర్ సిక్స్–సూపర్ హిట్ సభకు భారీ ఎత్తున డ్వాక్రా మహిళలను అధికారులు, ప్రజా ప్రతినిధులు తరలించారు. వీరిని తరలించేందుకు ప్రభుత్వం ఆర్టీసీ, ప్రైవేట్ స్కూల్స్, కళాశాలలకు చెందిన బస్సులను ఏర్పాటు చేసింది. ఆ బస్సుల్లో జనాన్ని తరలించే బాధ్యతలను డ్వామా, వెలుగు శాఖలకు అప్పగించినట్లు సమాచారం. దీంతో ఆయా శాఖల అధికారులు జిల్లా స్థాయిలో తమ ఉనికిని చాటుకునేందుకు డ్వాక్రా మహిళలను పెద్ద ఎత్తున తరలించేందుకు ప్రయత్నించినా మహిళలు రాకపోవడంతో తలలు పట్టుకున్నారు. అధికారులు దగ్గరుండి మరీ జనాన్ని సభకు తీసుకెళ్లారు.

పొతుకుపోయారు..!

- నీటి సరఫరా విభాగంలో ఏళ్లుగావర్క్ ఇన్‌స్పెక్టర్ల తిష్ట
- నగర పాలక సంస్థలో అడ్డగోలు వ్యవహారాలు

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థలోని నీటి సరఫరా విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికారుల కనుసన్నల్లో జరిగే అడ్డగోలు వ్యవహారాలను కొందరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ముందుండి నడిపిస్తున్నారు. తద్వారా నగర పాలక సంస్థ ఆదాయానికి రూ.లక్షల్లో గండికొడుతున్నట్లు తెలుస్తోంది. అనధికారిక కనెక్షన్లతో పాటు కమర్షియల్ నీటి కనెక్షన్ల నుంచి వసూళ్లలోనూ కొంత మంది వర్క్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర ఉన్నట్లు నగర పాలక సంస్థలో జోరుగా ప్రచారం సాగుతోంది. వివరాలు.. నగర పాలక సంస్థలో మొత్తం 30 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఇందులో కొందరు ఏళ్ల తరబడి నీటి సరఫరా విభాగంలోనే తిష్టవేశారు. వీరి కనుసన్నల్లోనే అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే కొందరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు తోడై నీటి అక్రమ కనెక్షన్లు, పన్ను వసూళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నారు. వీరంతా ఔట్ సోర్సింగ్ కింద విధులు నిర్వర్తించేవారు కావడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాస్తవంగా నగర పాలక సంస్థలో రెగ్యులర్ ఉద్యోగుల చేతుల్లో కీలకమైన బాధ్యతలు ఉండాలి. అటువంటిది నీటి సరఫరా పన్నులకు సంబంధించిన రికార్డులను ఔట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు నిర్వహించడంతో పాటు పన్ను వసూళ్లకు సైతం వీరే వెళ్తుండడం గమనార్హం.

అనధికారిక కనెక్షన్ల నుంచి వసూళ్లు

నగరంలో కమర్షియల్ నీటి కనెక్షన్లు 560 ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. కానీ వాస్తవానికి ఏడు వేలకు పైగానే ఉంటాయని అధికారులే చెబుతున్నారు. రికార్డుల్లో పేర్కొనని కనెక్షన్ల నుంచి కొందరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆరునెలలకోసారి భారీగా సొమ్ము వసూలు చేసుకుంటున్నారు. ఈ విషయంపై నగర పాలక సంస్థ అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. కానీ సదరు వర్క్ ఇన్‌స్పెక్టర్లకు అధికార పార్టీ నేతల అండ ఉండడంతో ఏమీ చేయలేని పరిస్థితి.

బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు

నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తించే వర్క్ ఇన్‌స్పెక్టర్లకు అన్నీపోను ప్రతి నెలా రూ.15 వేలు మాత్రమే చేతికందుతుంది. కానీ ఓ ఐదుగురి వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఇళ్లను చూస్తే కళ్లు చెదిరిపోతాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. నగరంలోని హౌసింగ్ బోర్డు, రెవెన్యూ కాలనీ, నవోదయ కాలనీ ఎక్స్‌టెన్షన్, వేణుగోపాల్‌నగర్, తదితర ప్రాంతాల్లో సదరు వర్క్ ఇన్‌స్పెక్టర్లకు భారీ భవనాలు ఉన్నట్లు తెలుస్తోంది. వర్క్ ఇన్‌స్పెక్టర్లపై ఏసీబీ అధికారులు దృష్టి సారిస్తే అడ్డగోలు బాగోతాలు వెలుగు చూస్తాయని నగరపాలక సంస్థ వర్గాలే అంటున్నాయి.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర వేడుకలు

అనంతపురం కల్చరల్: వినాయకునికి ప్రీతికరమైన భాద్రపదమాసం, సంకష్టహర చతుర్థి రావడంతో బుధవారం పలు ఆలయాలలో విశేష పూజలు జరిగాయి. నగరంలోని మూడోరోడ్డు బాబా మందిరం, మారుతీనగర్‌లోని శ్రీకోదండ రామాలయం, రజకనగర్‌లోని సంకష్టహర వినాయక ఆలయాలలో సాయంత్రం నుంచి రాత్రి వరకు వినాయకుడు అభిషేకాలు, అలంకార సేవలు అందుకున్నాడు. ప్రత్యేకంగా తయారు చేసిన కుడుములతో నైవేద్యం సమర్పించారు. హెచ్చెల్సీ కాలనీ శ్రీనసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ గురుశేఖరబాబు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

అమ్మో జ్వరం!

- ఆత్మకూరులో పెరిగిన బాధితులు
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- కనీసం ఫాగింగ్ కూడా చేయని అధికారులు
- ఆస్పత్రికి క్యూ కడుతున్న జ్వర పీడితులు



ఆత్మకూరులో మారెప్ప సత్రం ఎదురుగా రోడ్డుపై నిలిచిన మురుగు

ఆత్మకూరు: ఎటు చూసిన అపరిశుభ్రత..రోడ్లపై పారుతున్న మురుగు కాల్వలు వెరసి ఆత్మకూరు మండలం జ్వరంతో విలవిల్లాడుతోంది. మండలంలోని ప్రతి ఇంట్లోనూ జ్వరాల ఇద్దరు, ముగ్గురు జ్వరంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో పది రోజుల నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి జ్వర పీడితులు భారీగా తరలివస్తున్నారు. ప్రస్తుతం ఎవరి నోట విన్నా 'జ్వరం' అన్న మాటే వినిపిస్తుస్తుంది. రోజుకు 150 మంది వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ నమోదవుతోంది. మరి కొంత మంది ప్రైవేటు డాక్టర్ల వద్దకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటున్నారు.

కనీస చర్యలు కరువు

మండలంలోని 25 గ్రామాలున్నాయి. ఏ గ్రామంలోనూ పారిశుధ్య చర్యలు సక్రమంగా జరగడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో నీరంతా మురుగు గుంతల్లో నిలిచి దోమల తీవ్రత పెరిగింది. అయినా అధికారులు కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదు. ముఖ్యంగా ఆత్మకూరు మేజర్ పంచాయతీ కార్యాలయంలో దోమల మిషన్ ఎక్కడుందని ప్రశ్నించగా.. పంచాయతీ సిబ్బంది పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. కనీసం మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. మండలంలోని చాలా గ్రామాల్లోని వీధుల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మురుగు వల్లనే దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, కనీసం దోమల మందు కూడా ఫాగింగ్ చెయ్యకుండా పంచాయతీ సిబ్బంది ఉన్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యమేల ..?

ఫాగింగ్‌కు ఇతర పంచాయతీ అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉన్నా... వాటిని వినియోగించేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. ముఖ్యంగా ఆత్మకూరు పంచాయతీలో సమస్యలు తిష్ట వేశాయి. ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. ఈ సమయంలో పంచాయతీ నిధుల ద్వారా దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతో పాటు మురుగు కాలువలు శుభ్రం చేస్తే జ్వరాలు వచ్చే అవకాశం ఉండదని స్థానికులు చెబుతున్నారు.

ఫాగింగ్ చేయించాలి

ప్రస్తుతం ఎక్కడ చూసినా దోమలు అధికంగా ఉన్నాయి. కరెంట్ పోతే దోమల బెడద తట్టుకోలేకపోతున్నాం. దోమల వల్ల పిల్లలకు విష జ్వరాలు వస్తున్నాయి. అధికారులు స్పందించి మురికి కాలువలు శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతో పాటు ఫాగింగ్ చేయించాలి.

– శ్రీరామ్, ఆత్మకూరు

పంచాయతీ అధికారులు స్పందించాలి

పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో అపరిశుభ్రత లేకుండా చూడాలి. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విష జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. దోమల వల్లే విష జ్వరాలు వస్తున్నాయి. వెంటనే గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలి.

– వెంకటేష్, ఆత్మకూరు

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రస్తుతం ఎక్కడ చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. ఆత్మకూరు మేజర్ పంచాయతీలో ఎక్కడ సమస్యలు లేకుండా చూస్తాం. అధికారులతో మాట్లాడి దోమల నివారణకు ఫాగింగ్ చేయించడంతో పాటు మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం .

– వరలక్ష్మి, సర్పంచ్, ఆత్మకూరు

వీరవనిత చాకలి ఐలమ్మ

- వర్ధంతి సభలో రజక సమాఖ్య నాయకులు



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: తెలంగాణ సాయుధ పోరాట వీరవనతి చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తామని రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య అన్నారు. బుధవారం స్థానిక ఐలమ్మ కాలనీలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సమాఖ్య నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చేసిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారన్నారు. రజకుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.నాగప్ప, సీవీ హరికృష్ణ, నాయకులు నాగరాజు, టీసీ భూషణ, ఈశ్వరమ్మ, చిన్ననారాయణస్వామి, లక్ష్మీనారాయణ, పెద్దన్న, శీనా, పోతులయ్య, నాగేంద్ర, పాండు, మలరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి



శివారెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన మాజీ సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శివారెడ్డి (55) అనారోగ్యంతో మృతి చెందారు. కొద్దిరోజులుగా బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివారెడ్డి బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. అక్కడి నుంచి భౌతిక కాయాన్ని సొంతూరు ఇటుకలపల్లికి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి గ్రామానికి చేరుకుని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు మామిళ్లపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, గురుప్రసాద్, సావిత్రి శ్రీనివాసులు, గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్త రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మారెప్ప, నాయకులు పూలకుంట భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

14 కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణ భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో ఈనెల 14న పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. రోగులు తమ వెంట రెండు రేషన్, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లతో పాటు మూడు పాస్‌ఫొటోలు, సెల్ ఫోన్ నంబర్‌తో హాజరుకావాలి. వివరాలకు 9440550000, 9866589899 నంబర్లలో సంప్రదించవచ్చు.

మద్యం అమ్మకాలు హిట్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి సర్కార్ అనంతపురం 'సూపర్ హిట్' సభ నేపథ్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. సభకు జనాలను తరలించేందుకు నాయకులు రూ.500 నగదులో పాటు ఒక క్వార్టర్ బాటిల్ ఇచ్చి బస్సుల్లోకి ఎక్కించారు. అయితే బస్సు ఎక్కీఎక్కగానే క్వార్టర్ కానిచ్చిన మందుబాబులు జేబుల్లో ఉన్న రూ.500 తీసుకుని దారిలో కనిపించిన మద్యం దుకాణాలకు పరుగులు తీశారు. ఈ క్రమంలోనే రాప్తాడులోని జేఎన్‌టీయూ రహదారిలో ఉన్న ఎస్వీఆర్ వైన్స్‌ను 'తమ్ముళ్లు' బార్‌గా మార్చేశారు. కొంత మంది మందుబాబులు వారికి కేటాయించిన ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ స్కూల్స్, కళాశాలలకు చెందిన బస్సులను వైన్ షాపు దగ్గరకే తీసుకువచ్చి మద్యం సేవించి సీఎం సభలకు వెళ్లారు. తెలుగు తమ్ముళ్ల దెబ్బకు రాప్తాడు వైన్ షాపు ఖాళీ అయ్యింది. కొంత మంది కూటమి నాయకులు సైతం తమ వాహనాల్లో వైన్ షాపు దగ్గరకు వచ్చి మద్యం తీసుకుని వెళ్తూ కనిపించారు.



రాప్తాడులో వైన్ షాపు దగ్గరకు వచ్చిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు



రాప్తాడులో వైన్ షాపు దగ్గరకు వచ్చిన వాహనాలు